గుడిసెలు వేసుకున్న ప్రదేశంలో మాట్లాడుతున్న నాయకులు

కార్మికుల వేతనాల్లో కోతలు..!

చెత్తసేకరణ వాహనాలతో ర్యాలీ నిర్వహిస్తున్న క్లాప్ డ్రైవర్లు (ఫైల్‌ఫొటో)

జగనన్న స్వచ్ఛ సంకల్పంలో భాగంగా చెత్త సేకరణ కోసం ప్రారంభించిన క్లాప్ వాహనాల డ్రైవర్ల వేతనాల్లో కోత విధించడమే కాకుండా వీరికి ప్రతి నెల వేతనాలు సైతం ఇవ్వడం లేదు. ప్రతినెల రూ.18,500లు ఇవ్వాల్సి ఉండగా, రూ.10,118 చెల్లిస్తున్నారు. తమకు చెల్లించాల్సిన వేతనాల్లో కోత విధించడం పట్ల డ్రైవర్లు పలు అనుమానాలను వ్యక్తంచేస్తున్నారు. ఇచ్చే వేతనాలు సైతం ప్రతి నెలా చెల్లించడం లేదు. గత 5 నెలలుగా వేతనాలు అందక క్లాప్ వాహనాల కార్మికుల కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయి. దీంతో కార్మికుల సమస్యలపై సిఐటియు ఆధ్వర్యంలో ఆందోళనకు సిద్ధమవుతున్నారు.

ప్రజాశక్తి-హిందూపురం

క్లీన్ ఆంధ్రప్రదేశలో భాగంగా వైసీపీ ప్రభుత్వం చెత్త సేకరణ కోసం క్లాప్ వాహనాలను తీసుకువచ్చింది. 2022 ఫిబ్రవరిలో రాష్ట్రవ్యాప్తంగా ఇంటింటి చెత్త సేకరణ ప్రారంభించింది. ఈ వాహనాలకు డ్రైవర్లను నియమించింది. ఒక్కొక్క వాహన డ్రైవర్‌కు రూ. 18,500లు, పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పిస్తామని చెప్పి విధుల్లోకి తీసుకుంది. ఈ నేపథ్యంలో హిందూపురం పట్టణానికి 25 వాహనాలు కేటాయించింది. మొదటి నెల డ్రైవర్‌కు రూ. 18,500లు ఇచ్చారు. ఈ ఏడాది నుంచి నెలకు రూ. 10,118లు చెల్లిస్తున్నారు. మిగిలిన రూ. 8వేలు ఎక్కడికి వెళుతోందో తెలియడం లేదు. ఈ సొమ్ము ఏజెన్సీ కాంట్రాక్టర్ జేబులోకి వెళుతోందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. డ్రైవర్లు తమ వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ గురించి అడిగితే ఉద్యోగాల నుంచి తొలగిస్తామని బెదిరిస్తున్నారు. దీంతో గత్యంతరం లేక విధులు నిర్వహిస్తున్నామని కార్మికులు చెబుతున్నారు. అయితే కార్మికులకు ప్రతి నెలా వేతనాలు చెల్లిస్తున్నారా అంటే అదీ లేదు. ఐదు నెలల నుంచి వేతనాలు రాలేదని, దీంతో కుటుంబ పోషణ భారంగా మారిందని డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్కర్లు రాకపోయినా డ్రైవర్లు పనిచేయాల్సిందేనని సచివాలయ కార్యదర్శులు ఒత్తిడి తెస్తున్నారు. కంపోస్ట్ యార్డులో చెత్తను వేసేందుకు గంటల తరబడి వాహనాలు నిలబడటంతో దుర్వాసన వల్ల రోగాల బారిన పడుతున్నామని కార్మికులు ఆవేదన చెందుతున్నారు. హిందూపురం పురపాలక సంఘానికి 25 వాహనాలు వచ్చాయి. దీని నిర్వహణ బాధ్యతను కడప జిల్లాకు చెందిన రెడ్డి ఎంటర్ ప్రైజెస్ వారికి రాష్ట్ర ప్రభుత్వం అప్పగించింది. ఈ వాహనాలతో ప్రతి రోజు అధికారులు సూచించిన ప్రాంతాల్లో ఇంటింటి చెత్త సేకరణ చేపడుతున్నారు. అయితే ఆరునెలలుగా ఏజెన్సీవారు సిబ్బంది ఇవ్వాల్సిన వేతనాలు చెల్లించడం లేదు. కనీసం మరమ్మతుకు గురైన వాహనాలను సైతం రిపేరీ చేయించడం లేదు. దీంతో 25 వాహనాల్లో 7 మూలన పడ్డాయి. మిగిలిన 18 వాహనాల్లో చెత్తను సేకరిస్తున్నారు. వాహనాలను ఏజెన్సీ నిర్వాహకులు పట్టించుకోవడం లేదు. సిబ్బందికి వేతనాలు ఇవ్వరు. సకాలంలో వాహనాలకు పెట్రోల్ సైతం వేయించక పోవడంతో పెట్రోల్ బంకుల వద్ద గంటల తరబడి వాహనాలను ఆపి వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో కార్మికులకు ఇవ్వాల్సిన వేతనాలను ఇవ్వాలని డిమాండ్ చేస్తు గత నెల క్లాప్ కార్మికులు వాహనాలతో పట్టణంలో ర్యాలీ చేపట్టారు. దీంతో ఏజెన్సీ నిర్వహకులు కార్మికులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. వేతనాలు ఇచ్చిన వెంటనే విధులు నిర్వహించే కార్మికులందరిని విధుల్లో నుంచి తొలగిస్తామని వారికి భయపెట్టినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలతో పాటు ఉద్యోగ భద్రత, సమస్యల పరిష్కారం కోసం సిఐటియు ఆధ్వర్యంలో ఆందోళనకు సిద్ధమవుతున్నారు.

ఇవ్వాల్సింది రూ.18,500...ఇచ్చేది రూ.10,118
5 నెలలుగా సిబ్బందికి అందని వేతనాలు

మరమ్మతులకు నోచుకోని వాహనాలు

ఏడాదిన్నర నుంచి క్లాప్ వాహనాలు మరమ్మతులకు నోచుకోవడం లేదు. ఇప్పటి వరకు వాహనాలకు ఒక్కసారి కూడా ఇంజన్ ఆయిల్ మార్చలేదు. కనీసం గ్రీస్ వేయలేని పరిస్థితి నెలకొంది. వాహనాలకు సెల్ఫ్ పనిచేయడం లేదు. ఇలా వివిధ కారణలతో 25 వాహనాల్లో 7 మూలన పడ్డాయి. వాహనం నిలబడితే ఆ రోజు డ్రైవర్‌కు ఆప్‌సెంట్ వేస్తున్నారు. వాహనంలో ఏదైనా మరమ్మతు వస్తే డ్రైవర్ వేతనంలో కట్ చేస్తున్నారు. డ్రైవర్లకు సెలవులు ఇవ్వడం లేదు. సెలవు కావాలంటే బయట డ్రైవర్లను పనిలో పెట్టి సెలవు తీసుకోవాలని ఏజెన్సీ నిర్వాహకులు చెబుతున్నారు. వాహనాలకు వారానికి ఒకసారి 25 లీటర్ల పెట్రోల్ మాత్రం వేయిస్తున్నారు.

ప్రతి నెలా వేతనాలు అందడం లేదు

ఉద్యోగంలోకి తీసుకునే సమయంలో ప్రతి నెల వేతనాలు ఇస్తామని ఏజెన్సీ నిర్వాహకులు చెప్పారు. అయితే 5 నెలలుగా వేతనాలు ఇవ్వక పోతే కుటుంబాలను ఎలా పోషించుకోవాలి. ఇది చాలదన్నట్లు ప్రతి రోజు ఉదయం 6 గంటలకు పెట్రోల్ బంకు వద్దకు వెళితే 8 గంటలకు పెట్రోల్ వేయిస్తారు. అనంతరం వార్డుల్లోకి ప్రతి ఇంటికి వెళ్లి చెత్తను సేకరించి, సేకరించిన చెత్తను కంపోస్టు యార్డుకు తరలించాల్సి ఉంటుంది. మున్సిపల్ నిబందనల మేరకు ప్రతి రోజు 1000 ఇండ్లల్లో చెత్తను సేకరించాలి. వెయ్యి ఇండ్లల్లో చెత్తను సేకరించడానికి కనీసం 10గంటలు సమయం పడుతుంది. క్లాప్ కార్మికులు ఉదయం 6 గంటలకు విధులకు హాజరయితే సాయంత్రం వరకు వారు విధులు చేయాల్సి ఉంటుంది. అయినప్పటికి కనీస వేతనం ఇవ్వడం లేదు. పోనీ ఇచ్చే అరకొర వేతనాలు సైతం ప్రతి నెల ఇవ్వడం లేదు.

నరసింహులు
క్లాప్ ఆటో డ్రైవర్

సమ్మెకు సంపూర్ణ మద్దతు

పురపాలక సంఘాల్లో విధులు నిర్వహిస్తున్న క్లాప్ కార్మికులు వారి హక్కుల సాధనకు చేపట్టే సమ్మెకు సిఐటియు తరపున సంపూర్ణ మద్దతు ఇస్తాం. క్లీన్ ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా పురపాలక సంఘాల్లో ఇంటింటి చెత్త సేకరణ జరుగుతోంది. దీనికి పురపాలక సంఘాల్లో యూజర్స్ చార్జీలు సైతం వసూలు చేస్తున్నారు. అయినప్పటికి కార్మికులకు కనీస వేతనం, ఈఎస్ఐ, పిఎఫ్ ఇవ్వడం లేదు. దీనిపై ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలు పరిష్కరించాలి. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతాం.

ఇఎస్ వెంకటేష్
సిఐటియు జిల్లా కార్యదర్శి

సమస్యను పరిష్కరిస్తాం

పురపాలక సంఘంలో విధులు నిర్వహిస్తున్న క్లాప్ ఆటో డ్రైవర్ల సమస్యలను ఏజెన్సీ నిర్వాహకులతో మాట్లాడి పరిష్కరిస్తాం. అన్ని సమస్యలను పరిష్కరించి, పురపాలక సంఘంలో క్లాప్ వంద శాతం అమలు అయ్యే విధంగా చర్యలు తీసుకుంటాం.

ప్రమోద్ కుమార్,
మున్సిపల్ కమిషనర్, హిందూపురం

అనువైన ప్రదేశంలో ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

ప్రజాశక్తి- చిలమత్తూరు

పేదలకు నివాసయోగ్యమైన ప్రదేశంలో ఇళ్లస్థలాలు ఇవ్వాలని వ్యవసాయకార్మిక సంఘం జిల్లా నాయకులు గంగాధర్ డిమాండ్ చేశారు. మండలంలోని కోడూరు రెవెన్యూ పొలం 805 సర్వేనెంబర్‌లో పేదలు వేసుకున్న గుడిసెలను సందర్శించిన ఆయన పేదలకు మద్దతు తెలిపారు. అనంతరం గంగాధర్ మాట్లాడుతూ ప్రభుత్వం చిత్తశుద్ధితో అనువైన ప్రదేశంలో ఇళ్ల స్థలాలు ఇవ్వాలన్నారు. ఇప్పుడు పేదలు గుడిసెలు వేసుకున్న స్థలం అన్ని విధాల అనుకూలమైనదన్నారు. ఇది ప్రభుత్వం జగనన్న లేవుట్ కోసం కేటాయించిన స్థలమని గుర్తుచేశారు. అయితే రియల్టర్లకు మేలు చేసేందుకు పేదలకు మరో ప్రదేశంలో స్థలం ఇస్తామనడం దుర్మార్గమన్నారు. ఇది ప్రభుత్వం కార్యాలయాలకు కేటాయించామని తహశీల్దార్ చెప్పడం వెనుక రాజకీయ ప్రయోజం ఉందని విమర్శించారు. నిజంగా ప్రభుత్వ కార్యాలయాలకు రిజర్వ్ చేసి ఉంటే అందుకు సంబందించిన పత్రాలు చూపాలని డిమాండ్ చేశారు. అనువైన ప్రదేశంలో ఇళ్ల స్థలాలు చూపకుండా మభ్యపెట్టే ప్రయత్నం చేస్తే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యకాసం జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్, నారాయణ, సిపిఎం మండల నాయకులు లక్ష్మి నారాయణ, ఇళ్ల స్థలాల పోరాట కమిటీ సభ్యులు రహమతుల్లా, సదా శివరెడ్డి, రాయల్ చందు, శివ, యుఎల్ నరసింహ, వేణు, చరణ్, రాజా, షామీర్ తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని చిరుత మృతి

ప్రజాశక్తి బత్తలపల్లి

మృతిచెందిన చిరుతపులి

మండలంలోని డి.చెర్లోపల్లి సమీపాన రామంజులపల్లి రైల్వే స్టేషన్ వద్ద బుధవారం తెల్లవారుజామున రైలు ఢీకొని చిరుతపులి మృతి చెందింది. గ్రామస్తులు, ఫారెస్ట్ అధికారులు తెలిపిన వివరాలు. డి. చెర్లోపల్లి సమీపానగల అక్కమ్మ గారి కొండల నుండి గ్రామ సమీపంలోకి బుధవారం తెల్లవారుజామున వస్తున్న చిరుతపులి రైల్వేలైన్ దాటుతుండగా అటుగా వెళుతున్న రైలు ఢీకొంది. దీంతో చిరుత అక్కడికక్కడే మృతి చెందింది. ఉదయాన్నే విషయం తెలుసుకున్న గ్రామస్తులు అధికసంఖ్యలో ఘటనాస్థలాన్ని సందర్శించారు. సమాచారం అందుకున్న పోలీసులకు, వెటర్నరీ అధికారులకు,ఫారెస్ట్ అధికారులకు చిరుతపులి మృతి చెందిన ప్రదేశానికి వచ్చి ప్రమాద వివరాలు సేకరించారు. డిఎఫ్ఒ రవీంద్రనాథ్ రెడ్డి, సబ్ డిఎఫ్ఒ ఆనంద్, రేంజ్ ఆఫీసర్ వేణుగోపాల్ ఇతర ఫారెస్ట్ సిబ్బంది ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. ఇన్‌ఛార్జి వెటర్నరీ ఏడీ వీరభద్రయ్య, గుర్నాథ్ రెడ్డి ఆధ్వర్యంలో మృతి చెందిన చిరుతపులికి పోస్టుమార్టం నిర్వహించి అక్కడే ఖననం చేసినట్లు రేంజ్ ఆఫీసర్ వేణుగోపాల్ తెలిపారు. మృతి చెందిన మగ చిరుతపులి వయసు రెండు సంవత్సరాల లోపు ఉంటుందని అన్నారు. కొండలలో నుండి చిరుతపులి వస్తూ రైల్వేలైన్ దాటుతూ రైలు ఢీకొని మృతి చెందినట్లు ఫారెస్ట్ అధికారులు పేర్కొంటుండగా, గత నెల రోజుల నుండి మూడు చిరుతపులులు కనిపిస్తున్నాయని రైల్వే గ్యాంగ్ మెన్లు చెప్పినట్లు గ్రామస్తులు పేర్కొంటున్నారు. బుధవారం తెల్లవారుజామున కూడా మూడు చిరుతపులులు రైల్వేలైన్ దాటుతూ ఒక చిరుత పులి రైలు కింద పడి మృతి చెందగా మరో రెండు తప్పించుకోగలిగాయని వారు వ్యాఖ్యానిస్తున్నారు. గ్రామ సమీపాన చిరుతపులి మృతి చెందిన విషయం తెలుసుకున్న డి.చెర్లోపల్లి, నల్లబోయినపల్లి, పత్యాపురం, రామంజులపల్లి తదితర సమీప గ్రామాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. మరో రెండు చిరుతపులులు తప్పించుకున్నాయన్న విషయం ఫారెస్ట్ అధికారులే తేల్చాల్సుంది.

సిడబ్ల్యుసి సభ్యులు రఘువీరాతో కర్నాటక మంత్రి భేటీ

ప్రజాశక్తి-మడకశిర

సిడబ్ల్యుసి మెంబర్ ఎన్.రఘువీరారెడ్డితో బుధవారం మండల పరిధిలోని నీలకంఠాపురం గ్రామంలో కర్నాటక సహకార శాఖ మంత్రి కెఎన్.రాజన్న భేటీ అయ్యారు. ఎన్నికల సమయంలో రఘువీరారెడ్డి మధుగిరి నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించి రాజన్న విజయానికి కృషి చేయడంతోనే రాజన్న ఆయనను కలిశారు. రఘువీరా మాట్లాడుతూ ఈ ప్రాంతం మధుగిరి నియోజకవర్గాన్ని ఆనుకొని ఉండటంతో రైతులు నిత్యం వివిధ పనులపై మధుగిరి ప్రాంతానికి వెళ్తూ ఉంటారని వారి సమస్యల పరిష్కారానికి మంత్రి రాజన్న చొరవ చూపాలని కోరారు. ముఖ్యంగా కర్నాటకలో పాల ధర పెరగడంతో ఇక్కడి పాడి రైతులు కర్నాటకలోని డెయిరీలకు పాలు తరలిస్తుంటారని అక్కడి ప్రభుత్వం వీరికి న్యాయం చేయాలని కోరారు. తమ సమస్యలు పరిష్కరించాలని ఈ ప్రాంత రైతులు రఘువీరా సమక్షంలో మొరపెట్టుకోగా మంత్రి రాజన్న సానుకూలంగా స్పందించారు. ఆయా సమస్యల పరిష్కారానికి తన వంతుగా కృషి చేస్తానని రైతులకు హామీ ఇచ్చారు. మంత్రితో పాటు జిజె రాజన్న, తదితరులు ఉన్నారు.

రఘువీరారెడ్డితో చర్చిస్తున్న కర్నాటక మంత్రి రాజన్న

రైతులకు అదనపు ఆదాయం కల్పించేలా చర్యలు

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ కార్తీక్

రైతులకు అదనపు ఆదాయం కల్పించే విధంగా వివిధ ప్రభుత్వ పథకాలపై విస్తృతంగా అవగాహన కార్యక్రమం చేపట్టాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కార్తీక్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని కోర్టు హాల్‌లో వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులతో పలు పథకాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ కొండయ్య సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ పాడి రైతులకు విరివిగా రుణాలు అందజేయాలని అందుకు కావాల్సిన అన్ని ఏర్పాట్లు పశుసంవర్ధక శాఖ జేడీ ఆధ్వర్యంలో చేపట్టాలని ఆదేశించారు. ముందుగా రైతులకు పథకాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టి అర్హులైన లబ్ధిదారుల ఎంపిక త్వరితగతిన చేపట్టాలన్నారు. పశుసంవర్ధక రంగంలో రెండు అంకెల వృద్ధి సాధనలో భాగంగా అనేక సంక్షేమ పథకాలు ప్రభుత్వం ప్రవేశపెడుతోందని వివరించారు. వివిధ రకాల ప్రకృతి వైపరీత్యాలపై ముందస్తు జాగ్రత్తల గురించి రైతులకు అవగాహన కల్పించాలని కరువు కాటకాల సమయంలో పలు అంశాల గురించి రైతులకు తెలియజేసి వారి ఆదాయం పెంచే విధంగా కృషి చేయాలని సూచించారు. నదీ పరివాహక ప్రాంతాలలో ఏయే పంటలు పండిస్తున్నారని భూగర్భ జలాల గురించి ఇంజనీర్లను అడిగి తెలుసుకున్నారు. 2023 సంవత్సరానికి సంబంధించిన ఖరీఫ్ ప్రణాళికలు ఏ విధంగా చేపట్టాలో సమీక్షించారు. జిల్లాను పండ్ల తోటల హబ్‌గా తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు. జగనన్న పాల వెల్లువ క్రింద పాడి రైతులకు ప్రభుత్వం ఇచ్చే రాయితీలు తెలియజేయాలని, స్వల్ప కాలిక రుణాలు రైతులకు విరివిగా ఇప్పించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి సుబ్బారావు, సిపిఒ విజయ్ కుమార్, హంద్రీనీవా ఇంజనీర్ గంగాధర్, పశుసంవర్ధక శాఖ జెడి శుభదాస్, సిరికల్చర్ జెడి పద్మావతి, ఉద్యానవన శాఖ అధికారి చంద్రశేఖర్, భూగర్భ జల అధికారి వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్ రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

20 తులాల బంగారు, కేజీ వెండి, ఆరు ద్విచక్ర వాహనాలు స్వాధీనం

ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్

స్వాధీనం చేసుకున్న బైకులు, (ఇన్‌సెట్‌లో బంగారు నగలు)

అంతరాష్ట్ర దొంగలు ముఠాను పోలీసులు బుధవారం అరెస్టు చేసి జిల్లా ఎస్పీ మాధవరెడ్డి ఎదుట హాజరుపరిచారు. శ్రీ సత్య సాయి జిల్లా ఎస్పీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఈ కేసుకు సంబంధించి వివరాలను వెల్లడించారు. హిందూపురానికి చెందిన దాదా పీర్, మహేంద్ర, పాత నర్సాపురానికి చెందిన నవీన్ కుమార్ ముఠాగా ఏర్పడి దొంగతనాలకు పాల్పడేవారు. వీరు ముగ్గురు చెడు వ్యసనాలకు బానిసై సులభంగా డబ్బు సంపాదించాలన్న ఉద్దేశంతో ఆంధ్ర, కర్నాటక, తెలంగాణ రాష్ట్రాలలో పలు దొంగతనాలు చేసి జైలుకు కూడా వెళ్లి వచ్చారు. వీరు ఒక ముఠాగా ఏర్పడి తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేసుకునే వారు. ఓడిసి, గోరంట్ల ,హిందూపురం వన్ టౌన్ ,హిందూపురం టూ టౌన్, పరిగి పోలీస్ స్టేషన్ పరిధిలో బంగారు, వెండి ఆభరణాలు, డబ్బులు, బైకులను ఎత్తుకెళ్లారు. వీరిలో కావడి మహేంద్ర పై పలు కేసులు ఉన్నాయి. తలారి నవీన్ కుమార్‌పై గోరంట్ల, పరిగి పోలీస్ స్టేషన్‌లో హత్యకేసులు ఉన్నాయి. నిందితులను అదుపులోకి తీసుకొని, 20 తులాల బంగారు , కేజీ వెండి, ఆరు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. దొంగలను పట్టుకోవడంలో చాక చక్యంగా వ్యవహరించిన శ్రీ సత్య సాయి జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రవీంద్రనాథ్ రెడ్డి, నల్లమాడ సర్కిల్ ఇన్స్పెక్టర్ జి రాజేంద్రనాథ్ యాదవ్ , ఓడిసి ఎస్ఐ మల్లికార్జునరెడ్డి, జిల్లా సిసిఎస్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ బి వెంకటేషులు, బి నారాయణ ఎంవి రమణలను, ఎస్పీ అభినందించారు. అదే విధంగా సిసిఎస్ పోలీస్ సిబ్బంది మహమ్మద్ అలీ ,సత్యనారాయణ నాయక్, భాస్కర్, సుధాకర్ ,ఎస్ కష్ణ నాయక్, విక్టర్ డి మల్లికార్జున, పవన్ కుమార్, అనిల్ నాయక్, బి రమేష్ మంజునాథ్‌లను పుట్టపర్తి స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది ఆనంద్ కుమార్, నరేష్ బాబు ,రెడ్డప్ప రెడ్డి ,హిందూపురం వన్ టౌన్ పోలీస్ స్టేషన్ సిబ్బంది, డీకే నరేష్, పీ వెంకటరామిరెడ్డి లను ప్రత్యేకంగా అభినందించి వారికి రివార్డులను అందజేశారు.

పండ్ల తోటలకు నిప్పు..

రూ. 20 లక్షల నష్టం

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పట్టణ సమీపంలోని చిన్నూరు గ్రామంలో రైతులు లింగప్ప, రామాంజనేయులుకు చెందిన పండ్ల తోటలకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో రూ. 20 లక్షల నష్టం వాటిల్లింది. బాధిత రైతులు తెలిపిన వివరాలు.. రామాంజనేయులుకు చెందిన 4 ఎకరాల్లో దానిమ్మ తోట, లింగప్పకు చెందిన 4 ఎకరాల్లో ద్రాక్ష, చీనీ చెట్లు సాగు చేశారు. పంట చేతికొచ్చే సమయంలో మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. బుధవారం ఉదయం తోటకు వెళ్లిన రైతులు లబోదిబోమంటూ వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఒక్కో రైతుకు రూ. 10 లక్షలు నష్టం వాటిల్లినట్టు వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు. ఈ విషయం తెలిసిన వెంటనే జనసేన నాయకుడు చిలకం మధుసూదన్‌రెడ్డి తోట వద్దకు వెళ్లి పరిశీలించారు. జరిగిన సంఘటను గురించి రైతులను అడిగి తెలుసు కున్నారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి రైతులకు న్యాయం చేయాలని కోరుతామన్నారు. ఆయన వెంట నాయకులు శ్యామ్‌కుమార్, దుర్గమ్మ, వెంకటేశ్, రామాంజనేయులు, చంద్రశేఖర్ ఉన్నారు.

బాధిత రైతులతో మాట్లాడుతున్న చిలకం మధుసూదన్‌రెడ్డి

మత్తు పదార్థాల జోలికెళ్లొద్దు

ప్రజాశక్తి-హిందూపురం

సదస్సులో మాట్లాడుతున్న సెబ్ జాయింట్ కమిషనర్ డాక్టర్ నాగలక్ష్మి

మత్తు పదార్థాల వాడకం వల్ల జీవితాలు నాశనం అవుతాయని ముఖ్యంగా విద్యార్థులు, యువకులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సెబ్ జాయింట్ కమిషనర్ డాక్టర్ నాగలక్ష్మి విద్యార్థులకు సూచించారు. డ్రగ్స్ రహిత ఆంధ్ర ప్రదేశ్ దిశగా అనే కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని బాలయేసు కళాశాలలో సెబ్ అధికారులు బుధవారం అవగాహన సదస్సును నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ అధికారి అశ్వర్థ నారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జాయింట్ కమిషనర్ డాక్టర్. నాగలక్ష్మి మాట్లాడుతూ మత్తు పదార్థాల వాడకం వల్ల జీవితాలు నాశనమవుతాయన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ రవికుమార్ మాట్లాడుతు మాదక ద్రవ్యాల వినియోగం, వాడకం వల్ల కలిగే అనర్థాలు, సమాజంలో ఎదురయ్యే అవమానాల గురించి వివరించారు. ఆరోగ్యాన్ని కాపాడుకుంటామని, మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని విద్యార్థులచేత సెబ్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ స్వర్ణలత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు భాస్కర్, రఘు, ఫణికుమార్, మంజునాథ్, నాగరాజు, సుజాత, సెబ్ పోలీసులు పాల్గొన్నారు.

సిపిఎస్, జిపిఎస్ వద్దు.. ఒపిఎస్ ముద్దు

నేటి నుంచి యుటిఎఫ్ ఆధ్వర్యంలో నిరవధిక దీక్షలు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సిపిఎస్, జిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్(ఒపిఎస్) విధానాన్ని అమలు చేయాలని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యుటిఎఫ్) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శెట్టిపి జయచంద్రారెడ్డి, సుధాకర్ డిమాండ్ చేశారు. పుట్టపర్తిలో బుధవారం వారు మాట్లాడుతూ యుటిఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 19వ తేదీ స్థానిక ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట నిరవధిక దీక్షలు చేపడుతామని విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్ర నాయకత్వం విజయవాడలో 18వ తేదీ నుంచే నిరవధిక దీక్షలు చేపట్టిందని, 19 నుంచి అన్ని జిల్లాల్లో జిల్లా నాయకత్వం, 20 నుంచి తాలూకా, డివిజన్ కేంద్రాల్లో డివిజన్, మండలాల నాయకత్వంలో ఉపాధ్యాయుల దీక్షలు ప్రారంభమవుతాయన్నారు. 21వ తేదీ సిపిఎస్ ఉపాధ్యాయులు, ఉద్యోగులు నిరవధిక దీక్షలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. అనంతరం అనుమతి కోరుతూ జిల్లా కార్యదర్శి కె.శివశంకర్, నాయకులు లక్ష్మీనారాయణ, బాబుతో కలిసి పోలీసు అధికారులకు వినతి పత్రం అందజేశారు.

దీక్షలకు అనుమతి కోరుతూ పోలీసులకు వినతిపత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి www.prajasakti.com

ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు : ఎస్పీ

ఎస్పీ మాధవరెడ్డికి బొకే అందజేస్తున్న ఎస్ఐ గంగాధర్

చిలమత్తూరు : 44వ నెంబర్ జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ఎస్పీ మాధవరెడ్డి తెలిపారు. ఎస్పీ బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌ను సందర్శించి మండలంలో శాంతి భద్రతల పరిస్థితులపై ఎస్ఐ గంగాధర్‌ను అడిగి తెలుసుకున్నారు. ముందుగా ఎస్ఐ ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఎస్పీ విలేకరులతో మాట్లాడుతూ కర్నాటక సరిహద్దు ప్రాంతం కావడం, జాతీయ రహదారి మండలం మీదుగా ఉండటంతో ప్రమాదాలు జరుగుతుంటాయని, వాటిని నివారించడానికి వైట్‌లైన్‌లు, బారీకేడ్లు ఏర్పాటు చేస్తామన్నారు. కర్నాటక మద్యం అక్రమ రవాణాను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. వీటి కోసం అవసరమైన చోట నిఘానేత్రాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు.

పాడి రైతులకు బోనస్ మొత్తం అందజేస్తున్న సంగం డెయిరీ నిర్వాహకులు

పాడి రైతులకు సంగం డెయిరీ బోనస్

తనకల్లు : మండల పరిధిలోని పరాకువాండ్లపల్లి వద్ద ఉన్న సంగం పాల డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ల నరేంద్ర ఆదేశాల మేరకు పాడి రైతులకు విజయ దశమి సందర్భంగా బోనస్ ప్రకటించారు. డెయిరీ పరిధిలో 1,350 మంది రైతులు ఉన్నారని వారి ఖాతాల్లో రూ. 38,62,083 జమ చేసినట్లు తెలిపారు. మేనేజర్ రావి బాలాజీ మాట్లాడుతూ రైతుల కష్టానికి తగిన ఫలితం అందస్తున్నామని, మిగ తా డెయిరీల కంటే ఎక్కువ ధరను నిర్ణయించి సకాలంలో రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి లక్ష్మీనారాయణ, సూపర్‌వైజర్లు శ్రీధర్‌రెడ్డి, నాగేంద్రబాబు, బాదుల్లా, రైతులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

పూర్వవిద్యార్థుల అపూర్వ సమ్మేళనం

గోరంట్ల : పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1982లో పదో తరగతి చదివిన విద్యార్థులు బుధవారం స్థానిక కెంపుల ఫంక్షన్ హాలులో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అప్పటి గురువులు రఘురాంరెడ్డి, మహమ్మద్‌అలీ, రామచంద్రారెడ్డి, కుళ్లాయప్ప, సుబ్రహ్మణ్యం తదితరులను ఘనంగా సన్మానించారు. నాటి గురువు రఘురాంరెడ్డి మాట్లాడుతూ 40 ఏళ్ల క్రితం తమ వద్ద చదువుకున్న విద్యార్థులు తమను సత్కరించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అనంతరం అందరూ కలిసి విందు భోజనం చేశారు.

పోట్లమర్రిలో పంటకోత ప్రయోగాలు

బత్తలపల్లి : మండలంలో ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగుచేసిన వేరుశనగ పంటలో దిగుబడి నిరాశాజ నకంగా నమోదైంది. ఎఒ ఓబిరెడ్డి పర్యవేక్షణలో ఎఎస్ఒ కెఎల్ఎన్ శర్మ బుధవారం పోట్లమరి గ్రామంలోని కేశవరెడ్డి పొలంలో పంట కోత ప్రయోగాలు నిర్వహించారు. 5/5 నిష్పత్తిలో నిర్వహించిన పంటకోత ప్రయోగంలో దిగుబడి 650 గ్రాములు మాత్రమే రావడంతో రైతులు నిరాశ చెందుతున్నారు. కార్యక్రమంలో విఎఎ ముత్యాలప్ప, రైతులు పాల్గొన్నారు.

20న టిడిపి వాల్మీకిగర్జన

కనగానపల్లి : రాప్తాడు టిడిపి కార్యాలయంలో ఈ నెల 20వ తేదీ నిర్వహిస్తున్న 'వాల్మీకి గర్జన'కు మండల వ్యాప్తంగా ఉన్న వాల్మీకులు పెద్దఎత్తున తరలి రావాలని మండల కన్వీనర్ యాతం పోతలయ్య, తగరకుంట సర్పంచి బొమ్మయ్య గారి మాధవరాజు, వాల్మీకి సాధికార ఫెడరేషన్ కార్యదర్శి బొమ్మయ్య గారి రాజకుమార్ పిలుపు నిచ్చా రు. స్థానిక టిడిపి కార్యాలయంలో బుధవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో వాల్మీకులు ఎదుర్కొంటున్న సమస్యలు, పార్టీ నిర్మాణంలో వాల్మీకుల పాత్ర, తదితర అంశాలపై సమావేశంలో చర్చిస్తారన్నారు. సమావేశంలో ఫెడరేషన్ ప్రతినిధి నారాయణ స్వామి, ముక్తాపురం ప్రసాద్, దేవ రాజు, నాగేంద్ర, అంకె వన్నూరప్ప పాల్గొన్నారు.

పాముకాటు బాధితునికి పరామర్శ

మడకశిర : పట్టణంలోని కౌన్సిలర్ ఉమాశంకర్ మామ కృష్ణమూర్తి పాముకాటు కు గురై స్థానిక ప్రభుత్వాసుపత్రితో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలిసిన వెంటనే నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి బుధవారం ఆసుపత్రికి వెళ్లి కృష్ణమూర్తిని పరామర్శించారు. అనంతరం హలుకూరు వద్ద రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారిని పరామర్శించారు. ఆయనతో పాటు టిడిపి మండల కన్వీనర్ దాసిరెడ్డి, తాలూకా బిసి సెల్ అధ్యక్షుడు తిప్పేస్వామి, తెలుగు యువత అధ్యక్షుడు తిమ్మరాజు, రవికుమార్, బద్రి, బొమ్మయ్యంగారి చంద్ర, ఐటిడిపి తాలూకా అధ్యక్షుడు కాంతరాజు, కొత్తపల్లి శ్రీరామరెడ్డి, శ్రీనాథ్, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు 'పల్లె' పరామర్శ

ప్రజాశక్తి-బుక్కపట్నం

మండల పరిధిలో వివిధ గ్రామాల్లో అనారోగ్య కారణాలతో బాధపడుతున్న పలువురి కుటుంబాలను బుధవారం మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. ఇందులో భాగంగా సిద్ధరాంపురం గ్రామంలో ఇటీవల బైక్ యాక్సిడెంట్‌లో గాయపడ్డ అరుణ్‌కుమార్, ఫక్రుద్దీన్‌లను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. ఇదే గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన సన్నాయప్ప మృత దేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం ధూపంపల్లి గ్రామం వెళ్లి అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న అంజనమ్మ, గౌరమ్మలను పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట టిడిపి మండల కన్వీనర్ మల్లిరెడ్డి, నాయకులు ఉన్నారు.

'పిఎం ఉజ్వల యోజన' గ్యాస్ కనెక్షన్ పొందండి

పుట్టపర్తి అర్బన్ : 'ప్రధానమంత్రి ఉజ్వల యోజన' పథకం కింద అర్హులైన వారు ఉచితంగా గ్యాస్ కనెక్షన్ పొందవచ్చని ప్రశాంతి గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు రాజీవ్‌దేవ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 18 ఏళ్లు నిండి దారిద్ర్య రేఖకు దిగువన ఉండి రేషన్ కార్డ్‌లో సభ్యులుగా ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తులను ప్రశాంతి గ్యాస్ ఏజెన్సీ ఎనుములపల్లి గణేష్ సర్కిల్‌లోని కార్యాలయంలో పొందవచ్చు అన్నారు. రేషన్ కార్డు, ఆధార్ కార్డు, రెండు పాస్ ఫోటోలు జతచేయాలన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

బత్తలపల్లి : తాడిమర్రి మండల పరిధిలోని గుడ్డంపల్లి గ్రామానికి చెందిన కొడుమూర్తి ఓబన్న ఈ నెల 15 వ తేదీ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ విషయం తెలిసి ఎమ్మెల్యే కేతిరెడ్డి సతీమణి సుప్రియ బుధవారం ఆ కుటుంబానికి రూ. 50 వేలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపిపి పాటిల్ భువనేశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న సుప్రియ

అనుభవదారులకు ఇళ్ల పట్టాలివ్వాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పెద్దన్న

తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పెద్దన్న, పేదలు

ప్రజాశక్తి-గోరంట్ల

అనుభవంలో ఉన్న పేదల స్థలాలకు తక్షణమే ఇళ్ల పట్టాలివ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పెద్దన్న డిమాండ్ చేశారు. మండల పరిధిలోని పాలసముద్రం గ్రామానికి చెందిన బిసి, మైనారిటీ వర్గాల ప్రజలు అనుభవంలో ఉన్న స్థలాలకు అనుభవ హక్కు ధ్రువీకరణ పత్రాలు(పొజిషన్ సర్టిఫికెట్) మంజూరు చేయాలని కోరుతూ బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేశారు. పెద్దన్న మాట్లాడుతూ పేదలు 40 ఏళ్ల నుంచి అనుభవంలో ఉన్నారని, వారు రాళ్లు కొట్టుకొని జీవనం సాగిస్తున్నారన్నారు. వీరి స్థలాలను కొందరు కబ్జా చేస్తున్నారని, వారిని నియంత్రించి పేదలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. స్పందించిన తహశీల్దార్ మాట్లాడుతూ స్థలాలు కబ్జా కాకుండా చర్యలు తీసుకుంటామని, ప్రతి అర్జీని విచారించి అర్హులకు న్యాయం చేస్తా మని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు హను మయ్య, వెంకటేశులు, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు నాగభూషణ, పేదలు షకీలాబాను, రామలక్ష్మమ్మ, మంగమ్మ, సుకన్య, లక్ష్మి, ప్రమీల, లక్ష్మీదేవి, రజిని, వాణి, నిర్మల, శాంతమ్మ, నారాయణ, రూప, రమణమ్మ, రామాంజనే యులు, సాయిలక్ష్మి, లావణ్య, తిప్పమ్మ, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

హామీలన్నీ నెరవేర్చాం : ఎమ్మెల్యే

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-బత్తలపల్లి

పాదయాత్ర సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ అధికారంలోకి రాగానే సిఎం జగన్ అమలు చేసి ప్రజల ఆదరాభిమానాలు చూరగొన్నారని, అందుకే ఎపికి మళ్లీ జగనే కావాలని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట రామిరెడ్డి పేర్కొన్నారు. 'ఎపికి జగనే ఎందుకు కావాలి' కార్యక్రమంపై బత్తలపల్లిలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే పార్టీ ప్రతినిధులకు దిశా నిర్దేశం చేశారు. రాష్ట్ర ప్రజల అభివృద్ధి, సంక్షేమం జగన్‌తోనే సాధ్యమని నిరూపించారన్నారు. 'గుడ్ మార్నింగ్ ధర్మవరం', 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమాలతో ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించానన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను 95 శాతం మందికి అందిం చగలిగామన్నారు. వీటిని ప్రజాప్రతినిధులు, పార్టీశ్రేణులు, గృహసారథులు ఇంటింటికీ వెళ్లి వివరించాలన్నారు. అనంతరం స్థానిక కదిరి రోడ్డులోని విలేజ్ మార్ట్ పక్కన ఆర్‌కెఆర్ కాంప్లెక్స్‌లో మండల కన్వీనర్ మాదిరెడ్డి జయరాంరెడ్డి ఏర్పాటు చేసిన వైసిపి నూతన కార్యాలయాన్ని ఎమ్మెల్యే కేతిరెడ్డి ప్రారంభించారు. ఆ తర్వాత గంటాపురం గ్రామం వెళ్లి అనారోగ్యంతో బాధపడుతున్న ఎస్సీ సెల్ నాయకుడు తప్పెట పెద్దన్నను పరామర్శించారు. ఎమ్మెల్యేతో పాటు ఎపి కురుబ కార్పొరేషన్ ఛైర్మన్ కోటి సూర్య ప్రకాష్ బాబు, వైసిపి మండల కన్వీనర్ మాదిరెడ్డి జయరామిరెడ్డి, ఎంపిపి బగ్గిరి త్రివేణిరెడ్డి, బగ్గిరి బయపరెడ్డి, రాంభూపాల్‌రెడ్డి, జడ్పిటిసి కోటి సుధ, జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాస్‌రెడ్డి, ఎంపిటిసిలు కోటి నరేష్ కుమార్, తప్పెట ఆంజనేయులు, సర్పంచులు అక్కిం కాశమ్మ, చల్లా కరుణాకర్‌నాయుడు, సానే జయచంద్రరెడ్డి, తదితరులు ఉన్నారు.

ప్రజల ప్రాణాలతో ప్రభుత్వం చెలగాటం

టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి

ప్రభుత్వాసుపత్రి ముందు నిరసన చేపట్టిన గుండుమల తిప్పేస్వామి, తదితరులు

ప్రజాశక్తి-మడకశిర

వైసిపి ప్రభుత్వం ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతోందని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి ధ్వజమెత్తారు. అమరాపురం మండల పరిధిలోని హనుమంతనపల్లి గ్రామానికి చెందిన పాత లింగప్ప, రాధమ్మ దంపతుల కుమారుడు రుషి(5) విషజ్వరంతో చికిత్స పొందుతూ మడకశిర ప్రభుత్వాసుపత్రిలో మంగళవారం మృతి చెందాడు. మృతదేహాన్ని తరలించడానికి 109 సదుపాయం కల్పించకపోవడంతో ద్విచక్ర వాహనంలోనే తరలించారు. ఈ విషయంలో ప్రభుత్వ వైఖరిని ఖండిస్తూ బుధవారం గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వాసుపత్రి ముందు నిరసన కార్యక్రమం చేపట్టారు. తిప్పేస్వామి మాట్లాడుతూ 'జగనన్న ఆరోగ్య సురక్ష' ప్రచార ఆర్భాటమే అన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా విష జ్వరాలతో నలుగురు చనిపోయినా స్పందించకపోవడం ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమన్నారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి రుషి కుటుంబాన్ని ఆదుకోవాలని, ఆసుపత్రి భవనాలను వెంటనే పూర్తి చేయాలని, ప్రజలకు 108 వాహనాలను, మందులను, వైద్య సిబ్బందిని నిత్యం అందుబాటులో ఉండాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పట్టణ, మండల కన్వీనర్లు మనో హర్, లక్ష్మీనారాయణ, సుబ్బరాయుడు, నాగరాజు, ఓబన్న, ప్రధాన కార్యదర్శి పుల్లయ్యచౌదరి, కోట్ల రంగేగౌడ్, నరేష్ కన్నా, కల్లుమర్రి సర్పంచి నాగరాజు, మల్లికార్జున, కృష్ణమూర్తి, రామాంజనేయులు, కాంతరాజు, ఉమా శంకర్, రవీంద్రారెడ్డి, తిమ్మరాజు, గోపాలప్ప, నర్సేగౌడ్, రవికుమార్, నరసింహప్ప, బద్రి పాల్గొన్నారు.

కులం పేరుతో దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శిస్తున్న వేణురెడ్డి

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రూరల్ మండలం పూలకుంటలో మంగళవారం రాత్రి టిడిపి సర్పంచు మంజునాథ్, ఆయన అనుచరులు కులం పేరుతో దాడి చేశారని, వీరిని కఠినంగా శిక్షించాలని వైసిపి నాయకులు గుడ్డంపల్లి వేణురెడ్డి పోలీసులను కోరారు. దాడిలో గాయపడిన వారు హిందూపురం జిల్లా ప్రభుత్వ అసుపత్రిలో చికిత్స పొందుతుండగా వారిని గుడ్డంపల్లి వేణురెడ్డి బుధవారం పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతు పూలకుంట గ్రామంలో కొల్లాపురమ్మ ఆలయం వద్ద గ్రామవాలంటీర్ అరుణ, గృహసారథి రత్నమ్మ, వైసీపీ నాయకులు చాకలి నరసింహప్ప, చాకలి రాజశేఖర్‌లను సర్పంచి మంజునాథ్. ఆయన అనుచరులు ఆలయంలోకి పోనీయకుండా అడ్డుకున్నార న్నారు. తక్కువ కులం అని, పూజలు చేయరాదని అడ్డుకుని వారిపై దాడి చేశారన్నారు. కులం పేరుతో దుషించి, దాడులకు పాల్పడిన సర్పంచి, ఆయన అనుచరులపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరామన్నారు. అదే విధంగా దాడిలో గాయపడిన కుటుంబాలతో పాటు బిసి, ఎస్‌సి, ఎస్టీ, మైనార్టీలకు వైసిపి ఎప్పుడు అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ సంతేబిదనూరు రాము, కిరికెర ఎంపీటీసీ ధనుంజయ రెడ్డి, నాయకులు నక్కలపల్లి శ్రీరామ్ రెడ్డి, తిప్పే రుద్రయ్య, మైనార్టీ నాయకులు మార్కెట్ చాంద్, పట్టణ మహిళా అధ్యక్షురాలు నాగమణి, జెసిఎస్ కన్వీనర్ గిరి, నందమూరి నగర్ మోహన్, కురుబ శివప్ప, రామంజప్ప తదితరులు పాల్గొన్నారు.

'బాబుతో నేను' కార్యక్రమంలో మాట్లాడుతున్న పల్లె రఘునాథరెడ్డి, గుట్టూరులో కరపత్రాలు పంపిణీ చేస్తున్న సవితమ్మ, తెలుగుతమ్ముళ్లు

చంద్రబాబుకు ఏదైనా జరిగితే ప్రభుత్వానిదే బాధ్యత

మాజీ మంత్రి పల్లె

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

టిడిపి అధినేత చంద్రబాబుకు జైలులో ఏదైనా జరిగితే ప్రభుత్వానిదే పూర్తి బాధ్యత అని మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి ధ్వజమెత్తారు. 'బాబుతో నేను' కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆయన మండల పరిధిలోని బొంతలపల్లి, గంగిరెడ్డిపల్లి గ్రామాల్లో టిడిపి నాయకులతో కలిసి కరపత్రాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణమే చంద్రబాబు ఆరోగ్య పరిస్థితులపై అన్ని విషయాలు బహిర్గతం చేయాల డిమాండ్ చేశారు. సిఎం జగన్ రాజకీయ కక్షతో చంద్రబాబును అక్రమ కేసులో జైలులో పెట్టించి పైశాచిక ఆనందం పొందుతున్నారని దుయ్యపట్టారు. ప్రజలు అన్నిటినీ గమనిస్తున్నారని, అరాచక పాలనకు చరమగీతం పాడేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. త్వరలోనే బాబు బయటికి వస్తారని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ విజయ్‌కుమార్, శ్రీరామ్‌రెడ్డి, అంబులెన్స్ రమేష్, సోమకోటి ఆదినారాయణ, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అధికార దాహంతో చంద్రబాబుపై తప్పుడు కేసులు

పెనుకొండ : అధికార దాహంతో టిడిపి అధినేత చంద్రబాబుపై తప్పుడు కేసులు నమోదు చేశారని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ పేర్కొన్నారు. 'బాబుతో నేను' కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల పరిధిలోని గుట్టూరు గ్రామంలో నిర్వహించిన వారపు సంతలో, ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంచుతూ పంపిణీ చేశారు. చంద్రబాబుకి మద్దతుగా 92612 92612 నంబర్‌కు మిస్డ్ కాల్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సూర్యనారాయణ, పార్టీ నాయకులు, కార్యకర్తలు, సిపిఐ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి బస్టాండ్‌లో టాయిలెట్ నిర్వాహకుల ఇష్టారాజ్యం

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

పుట్టపర్తి ఆర్‌టిసి బస్టాండ్‌లో టాయిలెట్ నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ ప్రయాణికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయంలో బుధవారం బస్టాండ్‌లోని మరుగుదొడ్ల నిర్వాహకులతో పలువురు ప్రయాణికులు వాగ్వాదానికి దిగారు. మూత్ర విసర్జనకు రూ. 5, మలమూత్ర విసర్జనకు రూ. 10 చొప్పున వసూలు చేయడం పట్ల ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వీటి నిర్వహణను బయటి ప్రాంతాల వారు దక్కించుకున్నందున ఎవరిని అడగాలో తెలియక ప్రయాణికులు సిబ్బంది చెప్పిన ప్రకారం చెల్లిస్తున్నారు. బస్టాండ్ ఆవరణలోనే జిల్లా ప్రజా రవాణా అధికారి ఉన్నప్పటికీ ఈ నిలువు దోపిడీని అరికట్టలేకపోతున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఇకనైనా ఆర్‌టిసి ఉన్నతాధికారులు స్పందించి రుసుము వసూలుపై చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష' నిరుపేదలకు రక్ష

గుడిబండ : వైసిపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' నిరుపేద రోగులకు రక్ష అని తాళికెర సర్పంచి రంగస్వామి పేర్కొన్నారు. మండల పరిధిలోని తాళికెర గ్రామంలో బుధవారం నిర్వహించిన వైద్య శిబిరంలో వివిధ శాఖల అధికారులు, వైద్య నిపుణులు, అంగన్వాడీ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు. సర్పంచి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలోని రోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అమరాపురం : మండల పరిధిలోని గునేపల్లి ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో ఎంపిడిఒ మునిస్వామి, హెల్త్ సూపర్‌వైజర్ ఉమాపతి ఆధ్వర్యంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో సుమారు 300 మందికి పైగా వివిధ పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ రమేష్‌బాబు, జడ్పిటిసి సారక్క నరసింహమూర్తి, ఎంపిపి ఈరన్న, వైస్ ఎంపిపి కృష్ణమూర్తి, ఐఒఆర్‌డి నాగముని, పంచాయతీ కార్యదర్శి నరేష్, సర్పంచి తిప్పేస్వామి పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

బావిలో మృతదేహం లభ్యం

గాండ్లపెంట : మండల పరిధిలోని సింగానవారిపల్లెకు చెందిన రామచంద్ర(40) బుధవారం బావిలో శవమై తేలాడు. కదిరి టౌన్ సిఐ నారాయణరెడ్డి తెలిపిన వివరాలు.. రామచంద్ర శనివారం సాయంకాలం కురుమామిడి గ్రామం నుంచి స్వగ్రామం వెళ్తూ మార్గమధ్యలో ఆ గ్రామానికి చెందిన రైతు గంగిశెట్టి పొలంలోకి వెళ్లాడు. అయితే సదరు అడవి జంతువుల నుంచి పంట రక్షణ కోసం పొలం చుట్టూ విద్యుత్ వైర్లు ఏర్పాటు చేశాడు. ఆ వైర్లు తగిలి విద్యుత్ షాక్‌కు గురై రామచంద్ర అక్కడికక్కడే మృతి చెందాడు. ఇది గమనించిన గంగిశెట్టి కుటుంబ సభ్యులు మరికొందరితో కలిసి మృతదేహానికి సిమెంట్ దిమ్మెలను డ్రిప్ వైరుతో కట్టి బావిలో వేశారు. మృతుని కుటుంబ సభ్యులు చుట్టుపక్కల గాలించగా బావిలో శవమై కనిపించాడు. విషయం తెలిసిన వెంటనే పోలీసులు సంఘ టనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కదిరి ఆసుపత్రికి తరలించారు. అతడి భార్య అంజనమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు. అతడికి భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు.

కొనసాగుతున్న సెబ్ దాడులు

పుట్టపర్తి రూరల్ : ఎస్పీ మాధవరెడ్డి ఆదేశాలతో జిల్లాలో సెబ్ దాడులు నిరంతరం కొనసాగుతున్నాయి. సెబ్ సిబ్బంది బుధవారం హిందూపురం సెబ్ స్టేషన్ పరిధిలోని సింగిరెడ్డిపల్లి క్రాస్‌లో ఒకరిని, ధర్మవరం సెబ్ స్టేషన్ పరిధిలోని బుద్దారెడ్డిపల్లిలో ఒకరిని అరెస్టు చేసి వారి నుంచి కర్నాటక మద్యం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కదిరి సెబ్ స్టేషన్ పరిధిలోని బత్తలపల్లితండాలో నాటు సారా తయారీకి ఉపయోగించే వంద లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించండి

హిందూపురం : అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అందించే ఆహారపదార్థాల్లో నాణ్యత ప్రమాణాలు పాటించి, నాణ్యమైన ఆహారం అందించాలని రాష్ట్ర తెలుగు మహిళ కార్యదర్శి పరిమళ, రాష్ట్ర అంగన్వాడీ కార్యదర్శి వెంకటలక్ష్మి ఐసిడిఎస్ అధికారులను కోరారు. బుధవారం మండలంలోని పులమతి, సడ్లపల్లి, కోడిపల్లి, కొత్తపల్లి గ్రామాల్లో ఉన్నా అంగన్వాడీ కేంద్రాలను వారు పరిశీలించారు. అంగన్వా డీ కేంద్రాలకు గుత్తేదారులు సరఫరా చేసిన కోడి గుడ్ల నాణ్యత సరిగా లేవని విమర్శించారు. ఈ అవినీతిపై సమగ్ర విచారణ జరిపి అవినీతికి పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని సిడిపిఒ రెడ్డి రమణమ్మ, సుపర్ వైజర్ శాంతను కోరారు. సరఫరా చేసి ఆహార పధార్థాల్లో నాణ్యత లోపిస్తే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో తెలుగు మహిళలతో పాటు సుపర్ వైజర్ జయమ్మ పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ప్రయాణం సురక్షితం

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ఆర్టీసీ బస్సులోనే సురక్షిత ప్రయాణం ఉంటుందని ప్రయివేటు వాహనాల్లో ప్రయాణించి ప్రమాదాలను కొని తెచ్చుకోవద్దని డిఎం మోతిలాల్‌నాయక్ సూచించారు. స్థానిక డిపోలో బుధవారం డిఎం మాట్లాడుతూ ధర్మవరం డిపోనకు చెందిన పావగడ రూట్ బస్సులో లక్కీ డిప్ బాక్సు ఏర్పాటు చేశామన్నారు. ప్రయాణికులు బస్సు దిగే సమయంలో టికెట్‌పై వారి అడ్రస్ రాసి బాక్సులో వేయాలని, ప్రతి నెలా 15వ తేదీన బాక్స్ తెరిచి లక్కీ డిప్ తీసి ఎన్నికైన విజేతలకు బహుమతులను అందజేస్తామన్నారు. ప్రథమ బహుమతి రామగిరి మండలం ఎగువపల్లికి చెందిన నబీరసూల్, రెండో బహుమతి ధర్మవరం పట్టణానికి చెందిన నాగరాజు(ఆగ్రో ఏజెన్సీస్ యజమాని)లకు డిఎం అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి వెంకటేశులు, ఆఫీస్ సూపరింటెండెంట్ ప్రేమకుమార్, యూనియన్ నాయకులు కెబి.నాగార్జునరెడ్డి, ముత్యాలప్ప, బాబు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

ఓబుళదేవరచెరువు : ఆర్థిక అక్షరాస్యతపై అందించే సేవల గురించి బుధవారం స్థానిక ఎడిసిసి బ్యాంకులో బ్రాంచి మేనేజర్ అర్చన, సూపర్‌వైజర్ బ్రహ్మాచారి, అసిస్టెంట్ మేనేజర్ ప్రవల్లిక రైతులకు అవగాహన కల్పించారు. వారు మాట్లా డుతూ బంగారు ఆభరణాలపై తక్కువ వడ్డీతో రుణాలు మంజూరు చేస్తారని, ఫిక్స్‌డ్ డిపాజిట్లపై ఎక్కువ వడ్డీ వస్తుందని, క్రాప్ లోను కూడా తక్కువ వడ్డీతో ఇస్తారని తెలిపారు. బ్యాంకు ద్వారా అందించే సేవలు సంతృప్తి కరంగా ఉన్నాయని రైతులు తెలిపారు. చివరగా గతంలో బ్రాంచ్‌లో మేనేజర్‌గా పనిచేసిన పి.కుసుమకుమారి మృతి పట్ల రైతులు, బ్యాంకు సిబ్బంది మౌనం పాటించారు.

రబి సాగుకు సమాయత్తం కండి : ఎడిఎ

నంబులపూలకుంట : రైతులు రబి సాగుకు సమాయత్తం కావాలని ఎడిఎ సత్యనారాయణ సూచించారు. రబి సీజన్‌లో పంటలు సాగు చేయదలచిన రైతులకు 'పంటల ప్రణాళిక, సాగు పద్ధతుల'పై బుధవారం ఆర్‌బికె సిబ్బందితో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రబి సీజన్‌లో బోర్ల కింద వేరుశనగ, పొద్దుతిరుగుడు, మొక్కజొన్న, తదితర పంటలు సాగుకు అనుకూలంగా ఉంటాయని తెలిపారు. అలాగే పొలంబడి, ఆర్‌బికెల ద్వారా ఎరువుల విక్రయం, పిఎం కిసాన్, తదితర పథకాలపై చర్చించారు. ఖరీఫ్–2023కి సంబంధించి ఈ క్రాప్, ఈకెవైసి ప్రక్రియను మండలంలో వంద శాతం పూర్తి చేశారని తెలిపారు. మండల పరిధిలోని కౌలు రైతులకు లోన్ విషమంపై రెక్కమాను ఎపిజిబి మేనేజర్ వారితో కలిసి చర్చించారు.

'టిడిపి శ్రేణులెవరూ పార్టీ మారలేదు'

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

నియోజకవర్గంలో టిడిపి బలంగా ఉందని, ఎక్కడా కార్యకర్తలు కానీ నాయకులు కానీ ఇతర పార్టీలో చేరలేదని స్థానిక టిడిపి నాయకులు స్పష్టం చేశారు. పట్టణంలోని టిడిపి కార్యాలయంలో బుధవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వైసిపి కార్యకర్తలకే వైసిపి కండువాలు వేసి టిడిపి నాయకులు వైసిపిలో చేరినట్టుగా ఆ పార్టీ నాయకులు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. తెలుగుతమ్ముళ్లు ఎవరికీ భయపడకుండా టిడిపి జెండాను భుజస్కంధాలపై మోస్తున్నారన్నారు. మరో ఆరు నెలల్లో వైసిపి దుకాణం సర్దుకునే పరిస్థితి వస్తుందన్నారు. సమావేశంలో నాయకులు కమతం కాటమయ్య, ఫణికుమార్, చింతపులుసు పెద్దన్న, నాగూర్‌హుస్సేన్, అంబటి సనత్, రాళ్లపల్లి షరీఫ్, కేశగాళ్ల శీన, రామకృష్ణ, మారుతిస్వామి, అస్లాం పాల్గొన్నారు.

ప్రశాంతి నిలయంలో దసరా ఉత్సవాలు

యజ్ఞం చేస్తున్న వేదపండితులు

పుట్టపర్తి అర్బన్ : ప్రశాంతి నిలయంలో బుధవారం వేద పండితుల పర్యవేక్షణలో వేద పురుష సప్తాహ జ్ఞానయజ్ఞంతో దసరా ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. సాయి కుల్వంత్ హాలులో ఈ నెల 24వ తేదీ వరకూ ప్రతిరోజూ యజ్ఞంతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు, ఆధ్యాత్మిక బోధనలు నిర్వహిస్తారు. దసరా ఉత్సవాలు పురస్కరించుకొని ప్రశాంతి నిలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. ఇప్పటికే దేశ, విదేశాల నుంచి సత్యసాయి భక్తులు పుట్టపర్తికి చేరుకున్నారు. సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్ని సదుపాయాలు పూర్తి చేశారు.

ముదిగుబ్బ : స్థానిక కన్యకా పరమేశ్వరి ఆలయంలో వాసవీమాత అన్నపూర్ణదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు క్రిష్ణం మహేష్‌కుమార్ మాట్లాడుతూ అమ్మవారిని పూల తో ప్రత్యేకంగా అలంకరించి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించి అన్నప్రసాదం పంచి పెట్టామన్నారు. కార్యక్రమం లో అధ్యక్షుడు సూర్యనారాయణ, పాల్గొన్నారు.

బత్తలపల్లి : దసరా శరన్నవరాత్రులు పురస్కరించుకొని బుధవారం అమ్మవారు లలితా త్రిపుర సుందరీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. బత్తలపల్లిలో ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారు, లలిత త్రిపుర సుందరీ సమేత ఓంకారేశ్వరుని ఆలయం, కొల్లాపురమ్మ, బళ్లారి దుర్గమ్మ, సంజీవపురం సమీపంలోని కాటి కోటేశ్వరక్షేత్రంలోని మహంకాళీమాత ఆలయాల్లో అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, పూజలు చేశారు.

అమ్మవారిని కరెన్సీ నోట్లతో అలంకరించిన దృశ్యం

పెనుకొండ : మండల పరిధిలోని చంద్రగిరి గ్రామంలో వెలసిన మహేశ్వరి శక్తి పీఠంలో మహేశ్వ రీదేవి అమ్మవారిని కరెన్సీ నోట్లతో అలంకరించారు. అలాగే యజ్ఞాలు, యాగాలు, భాగవత పఠనం, భజన, అన్నదానం కార్యక్రమాలు నిర్వహించినట్లు నిర్వాహకులు దేవేంద్రస్వామి తెలిపారు.